# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్

నిద్దట్లో యాపచెట్టు ఉలిక్కిపడింది.

చిలకముక్కు దీపం తలెత్తి పైకి చూసింది.

''యాపచెట్టు గూడా చుక్కల దుప్పటి ముసుగేసుకుని కునుకు తీస్తా వుండాది. ఈపాటికి నేను గూడా మొగుడ్ని పక్కలో ఏసుకుని పట్టుపరుపెక్కుందును. ఈ లంజిదేమమ్మా ఇంగారాలేదు'' అని కోప్పడింది.

''ఎందుకే నీకంత కోపం? నీమాదిరి నోరు కలిగింది గాదు. చేవ కలిగింది. చెప్పిన పని ఆరునూరైనా, అగ్రహారం పాడైనా గోపినింటిది చేసే వస్తింది. వస్తాదిలే! రాక యాడికి పోతుంది'' అనింది మిద్దింటి దీపం.

## పేరుపుట్టింది






ఆమాటకి మూతి ముడుచుకునింది చిలకముక్కు దీపం.

''మనమెవరన్నా పొయ్యి చూసొద్దామనుకుంటే కొండెక్కించినాక తిరిగి చూడగూడదు. తిరిగిపొయినామా... నరులు మన గుట్టు కనిపెట్టేస్తారు'' అనింది నగిరింటి దీపం.

''అమ్మో... గుట్టు రట్టయిందనుకో ఈ నరులు పొద్దస్తమానం మనచేత ఊడిగం చేయించుకుంటారు. చీకటుంటేనే గదా! మన విలువ తెలిసేది'' అనింది గుడిసింటి దీపం.

''మన గుట్టేగాదు. మనం చెప్పుకునే కతల్లో గూడా గుట్టు రట్టు కాగూడదు. జీవిలోకి పాణం ఎట్లా వచ్చి వాలుతుందో? ఎట్లా ఎగిరి పోతుందో? ఎవరికీ తెలీదు. ఆ గుట్టు దేవుడికి తెలుసు. ఆ గుట్టు చెప్పేసినాడనుకో దేవుడు తలపగిలి చస్తాడు. కాపరం గుట్టు, వ్యాధి రట్టు అన్నేరు పెద్దోళ్ళు. కతలో ఏది గుట్టుగా వుంచాలో, ఏది రట్టు చెయ్యాలో తెలుసుండాలి. గుట్టు రట్టయిందనుకో కత చెప్పేవాడు తలపగిలి చస్తాడు. మీలో ఎవరైనా గుప్పెట మూసిపెట్టి కత చెప్పగలరా?'' అని అడిగింది పెద్దింటి దీపం.

దీపాలు మొగాలు చూసుకొన్నేయి.

''నేను చెప్తాను'' అని చేతిని పైకెత్తింది మిద్దింటి దీపం.

* * *

పాతగుడ్డలు కుట్టేదానికి సాయిబుల పల్లె నుంచి బూబవ్వ వచ్చింది.

ఆయవ్వ వస్తే పెదబ్బకి పండగొచ్చినట్టుంటుంది.

నెల చూసి పీర్లని దించి వున్నేరు. బొరుగులు, చెనిగలు, తీపి బూందీ చదివింపులు చేసుకోని తెచ్చింది.

పెదబ్బ సూదికి దారం ఎక్కించి ఇచ్చినాడు.

బూబవ్వ తీపిబూందీ పెట్టింది.

ఆయవ్వ గుడ్డలు కుడతా వుంటే, తీపి బూందీ తింటా చూస్తా కుర్చున్నాడు పెదబ్బ.

బూబవ్వ గుడ్డలు కుడతా ఎన్నో కతలు చెపుతుంది. అందుకే ఆయవ్వ అంటే పెదబ్బకి ఇష్టం.

''బూబవ్వా.. పొగులంతా మా ఇళ్ళల్లో కుర్చోని గుడ్డలు కుడతావు. రాత్తిరిపూట చెందమామలో మర్రిచెట్టు కింద కుర్చోని

ఎప్పుడు చూసినా నూలు వొడకతానే వుంటావు. నీకు యాష్టరాదా?'' అని అడిగినాడు తీపి బూంది తింటా పెదబ్బ.

''పొగులూ రెయ్యా కష్టపడకపోతే నాకు బువ్వ ఎవురు పెడతారు పెదబ్బా? పొగులు మీ ఇంట్లో గుడ్డలు కుడితే మీ అమ్మ బువ్వపెడుతుంది. రాత్తిరి పూట నూలొడికితే చెందమామ వాళ్ళమ్మ బువ్వపెడుతుంది'' అని చెప్పింది.

''నేనుండగా నీకు దిగులెందుకు బూబవ్వా? పెద్దోడ్ని అయినాక నేను కష్టపడి నిన్ను కూర్చోబెట్టి కూడుపెడతాను!'' అన్నేడు.

ఆమాటకి మురిసిపోయింది బూబవ్వ.

''నా మనవడమ్మా! నా అల్లాస్వామి తల్లీ!'' అంటా ముద్దు పెట్టుకునింది.

''ఏం బూమ్మా! మావోడు నిన్ను గూడా మాటలతో మునగచెట్టు ఎక్కించినట్టు వుండాడే'' అంటా లోపలినుంచి వచ్చింది జేజవ్వ.

జేజవ్వ పెదబ్బ వాళ్ళమ్మకి అవ్వ అవుతుంది. తిరమల కొండమింద వుంటుంది.

''పెద్దోడైతే నన్ను కూర్చనబెట్టి సాకతాడంట'' అనింది నవ్వతా.

''ఈడి తరవాత ఒగ ఆడబిడ్డ పుట్టింది. బర్రెలో ఒగ ఎముకలేదు. ఆరు నెలలుండి సచ్చిపొయింది. నాలుగేళ్ళు అయిపాయ. మల్లా బిడ్డలే కలగలేదు. ఒంటికొమ్ము సొంటికొమ్మే గదా బూమ్మా?'' అని బాధపడింది జేజవ్వ.

''మా పల్లెలో పీర్లు దించినారు. ఈ పొద్దు తొమ్మిదోరోజు. రాత్తిరికి గుండం తొక్కతారు. అమ్మణ్ణీ, నువ్వూ రండి. పీర్లదేవునికి మొక్కుంటే పిల్లలు పుడతారు'' అని చెప్పింది బూబవ్వ.

''నువ్వు చెప్పింది జరిగితే, నీ నోటినిండా చక్కెరపోసి నీకు కోకరైకా ఎత్తిస్తాను'' అనింది జేజవ్వ.

''కోకారైకా నాకెందుకు? నేను కట్టుకోను. పొడుగు చేతుల చొక్కాయి. కుచ్చెలు తీసియ్యి'' అనింది.

''మంచిమాట చెప్పి కడుపులో పాలుపోసినావు. ఇందుకే వచ్చినట్టుండాను తిరమల కొండ మింద నుంచి'' అనింది సంతోషంగా జేజవ్వ.

''మా బిడ్డ బూబూనాంచారమ్మ ఎట్లుండాది? మా అల్లుడు నామాలాయన బాగనే చూసుకుంటా వుండాడా?'' అని నవ్వతా అడిగింది బూబవ్వ.

''నీ అల్లుడికేం చెప్పు నిత్యకళ్యాణం. పచ్చతోరణం. గుండ్లు కొట్టుకోని కొండ దిగేవాళ్ళంతా మీ బూబూనాంచారమ్మ చుట్టాలే గదా!'' అనింది జేజవ్వ.

* * *

ఆమాపటేల జేజవ్వని, పెదబ్బ వాళ్ళమ్మని సాయిబులపల్లెకి పిలుచుకోని పొయింది బూబవ్వ.

వాళ్ళింట్లో కుర్చోబెట్టి పెదబ్బ వాళ్ళమ్మకి ప్రసాదం లాంటిది పెట్టింది.

కండ్లకద్దుకోని తినింది.

కొత్త తెల్లగుడ్డలో రూపాయి బిళ్ళని ముడుపు కట్టింది.

ఆన్నుంచి పీర్లచావిట్లోకి పిలుచుకోని పొయింది.

పీర్లు ధగధగలాడతా నాలికలు కోస్తా వుండాయి.

పూలు, గంధోడి కలగలిసిన సువాసనలతో పీర్లు పలవరిస్తా వుండాయి.

నమాజు చదివే గూని వొంగిపొయిన గడ్డం సాయిబు పీర్లముందు కుర్చోని ఉర్దూలోమంత్రాలు చదవతా చదివింపులు చేస్తా వుండాడు.

బొరుగులు చెనిగలు, తీపిబూందీ చదివింపులు చదివించి, ముడుపుని పీర్ల దెగ్గిరుండే గంధోడి తట్టలో పెట్టి,

''ఇదేనెల ముట్టు నిలిచి బిడ్డ పుడితే పీరు చెయించి, ఆ బిడ్డకి నీ పేరు పెట్టి మొక్కు తీర్చుకుంటాము అని మొక్కుకో అమ్మణ్ణీ'' అని చెప్పింది బూబవ్వ.

పెదబ్బ వాళ్ళమ్మ మనసులో తలచుకుని మొక్కుకునింది.

అంతే,

నాలుగైదు రోజుల్లో ముట్టు కావాల్సింది కాలేదు.

అదే ముట్టు నిలిచిపొయింది.

> ''పీరూ... నాయన పీరూ'' అని బిడ్డని కుదిలిస్తా పలకరించింది.
> ఇచ్చిత్తరం...!
> పీర్లదేవుని పేరు పెట్టి పిలవగానే ఒళ్ళోని పసిబిడ్డ కండ్లు తెరిసినాడు.
> ఆపైన తల్లి దెగ్గిర పాలుతాగినాడు.
> కొంచేపటికి జొరంగూడా తగ్గుమొగం పట్టింది.
> ఆవిధంగా గోపినోళ్ళింట్లో పీరు పుట్టింది.

సమచ్చరం తిరిగేసరికి చెందమామకి దీటుగా పండంటి మగబిడ్డని కనింది.

పదవరోజు స్నానం చెయించి, అయివోరికి చూపించి పేరుపెట్టమన్నేరు.

పంచాంగం తీసి, తిది నచ్చిత్తరం చూసి, జన్మన చ్చిత్తరాన్ని బట్టి 'భూ' అనే అచ్చిరం వచ్చిందని చెప్పి 'భూపతి' అని పేరు పెట్టినాడు.

అంతే,

ఆ పేరు పెట్టినప్పట్నుంచి ఇరవై రోజులపాటు మూసిన కన్ను తెరవకుండా జొరం కాస్తానే వున్నింది.

పీలేరుకి తీసుకోనిపొయినారు డాక్టరు దెగ్గిరికి.

ఆసుపత్రులన్నీ తిప్పినారు.

ఎన్ని సూదులేసినా, మాత్రలు నూరిపోసినా జొరం తగ్గలేదు.

అర్ధరాత్తిరి జొరం ఎక్కువైపొయ్యి మూసిన కన్ను తెరవలేదు.

పాలు తాగేది గూడా నిలిపేసినాడు.

వులకడూ, పలకడూ.

''మీరు ఇంగ బిడ్డమింద ఆశ వదులుకోవాల్సిందేనని'' డాక్టర్ చెప్పేసినాడు.

ఇంటికి తీసుకోని వచ్చేసినారు.

గురగురా ఊపిరి కొట్టకలాడతా వున్నింది.

ఈ విషయం తెలిసి సాయిబులపల్లె నించి పరిగెత్తుకుంటా వచ్చింది బూబవ్వ.

బిడ్డని జవిరివొళ్ళోకి తీసుకునింది.

జరిగినదంతా తెలుసుకుని,

''పీర్లదేవుని పేరు పెట్టకుండా ఎంత తప్పుచేసినారు అమ్మణ్ణీ!'' అని చెప్పి, రూపాయి బిళ్ళని కొత్తగుడ్డలో ముడుపుకట్టి, పీర్లదేవునికి మొక్కోని,

''తప్పయిపొయింది స్వామి! నీ పేరుతోనే పిలుచుకుంటాం'' అని చెప్పి

''పీరూ... నాయన పీరూ'' అని బిడ్డని కుదిలిస్తా పలకరించింది.

ఇచ్చిత్తరం...!

పీర్లదేవుని పేరు పెట్టి పిలవగానే ఒళ్ళోని పసిబిడ్డ కండ్లు తెరిసినాడు.

ఆపైన తల్లి దెగ్గిర పాలుతాగినాడు.

కొంచేపటికి జొరంగూడా తగ్గుమొగం పట్టింది.

ఆవిధంగా గోపినోళ్ళింట్లో పీరు పుట్టింది.

* * *

పీరుగోడికి మూడు సమచ్చరాలు నిండిపొయినాయి.

ఆ సమచ్చరం,

అమావాస్య పొయిన మూడోరోజు రాత్తిరి నెలను చూసి (నెలవంకని) నగరిలో పీర్లుపెట్టి దించినారు సాయిబులు.

కనవోరి బాయి దెగ్గిరికి తీసుకోని పొయ్యి చింత పొండుతో తళతళా మెరిసేట్టు తోమినారు.

కట్టెల మింద నిలబెట్టి, ఆకుపచ్చరంగు జలతారు గుడ్డలు కట్టి పీర్లను చావిట్లో కుర్చోబెట్టినారు.

సన్నజాజులు, మల్లెలతో అలంకరించినారు. గంధోడి చల్లినారు. ఊదొత్తుల పొగ సుడులు తిరగతా చావిడంతా పరుచుకునింది.

పీర్లచావిడి పూలు, గంధోడి కలగలిసిన వాసనలతో పలవరిస్తా వుండాది.

గూని వంగిపొయినా గడ్డం సాయిబు ఊతకట్టె మిందొచ్చి ఉర్దూలో మంత్రాలు చదివి, పీర్లకి చదివింపులు చేస్తా వుండాడు.

మాపటేల అయితే సాలు పిలకాయలందరూ పీర్లచావిడి కాడికి వచ్చేస్తారు.

పీర్లు ప్రాణం పోసుకున్న మనుషుల్లాగా అవుపించి పిలకాయలకి భలే భయాన్ని భక్తినీ కలిగిస్తాయి.

పీర్లచావిడి ముందు ఇసికలో ఆట్లాడుకుంటా, యింకోతట్టు ఎవురెవురు వచ్చి చదివింపు చెయిస్తా వున్నారా అని గమనించుకుంటా వుంటారు. ఎందుకనంటే సాయిబులైనా, హిందువులైనా పీర్లచావిడి కొచ్చి చదివించినారంటే ప్రసాదంలో సగం పిలకాయలకి పంచుతారు గదా! అందుకని.

ఏడోరోజు మేజాకట్టి పీర్లను ఊరు మెరవణి తిప్పుతారు.

ముందుగా నగిరిలోకి ఎత్తుకోనిపోతారు పీర్లని.

దొరవారు, దొరసానులిద్దరూ కలిసి కొత్త దుత్తల్లో పానకం, బొరుగులు, చెనిగలు తీపిబూందీ ఇచ్చి చదివింపులు చేస్తారు.

అక్కడినుంచి పీర్లు కరణం ఇంటికి పోతాయి.

మెళ్ళోళ్ళపల్లెలో వుండే కసారెడ్డప్ప ఇంటికి గూడా పోతాయి.

ఆఖరుగా గోపినోళ్ళింటికి వచ్చినాయి పీర్లు.

పీరుగోడికి మూడు సమచ్చరాలు నిండినాయి గదా! మొక్కు తీరుస్తున్నారు ఆపొద్దు.

తిరపతిలో అంగిడితాత పీరుని అరువు చెయించుకోని తెచ్చేసినాడు.

చుట్టాలు పక్కాలు వచ్చేసినారు.

పనిబాట్లోళ్ళు అన్నాలు తిని పైకి లేసినారు.

''పీర్లు వచ్చేసినాయి. తొందరగా కానీండి'' అంటూ అరస్తా వుండాడు గొర్రెలతాత.

మంగలోళ్ళు మేళతాళాలు వాయిస్తా వుండారు.

మాదిగోళ్ళు 'జజ్జనక జజ్జనక జజ్జనక జజ్జనక' అని పలకలు కొడతా వుండారు.

దిక్కులు దొని పలకతా వుండాయి.

వీర తిమ్మగోడు దిక్కుల్ని బిగపట్టి కొమ్మూ దతా వుండాడు.

ఏడేడు లోకాలు అప్పాలు తిరగతా వుండాయి.

బూబవ్వకి పిర్రలమింద పలకకొట్టినట్టుండాది. మాట యిచ్చిన ప్రకారం జేజవ్వ తీసిచ్చిన కొత్తగుడ్డలు కట్టుకునింది.

నడుమింద కుచ్చెలు నిలవడం లేదు.

ఊతకట్టి పాడుచుకుంటా పీర్లముందు 'హుస్సేన్ దొసేన్' అని అడుగులేస్తా వుండాది.

నమాజు చదివే గడ్డం సాయిబు పెద్దింట్లోకి పొయ్యి పీరునెత్తమని సైగ చేసినాడు.

గొర్రెలతాత ఒగ సంకన పీరుని, ఇంగొక సంకన పీరుగోడ్ని ఎత్తుకున్నాడు.

ఇంటిముందు నిలబడివున్న పీర్లతో గోపినింటి పీరు జతకలిసింది.

పీర్లు కదిలినాయి.

చాకలి వెంకటప్పన్న, ఆయన కొడుకు దివిటీలు ముట్టించినారు.

చాకలి చిన్నక్క పాతకోకలు నేలమింద పరస్తా వుండాది.

కోకలమింద పీర్లు నడస్తా వుండాయి.

కుమ్మరి యామసిద్దు కొత్తదుత్తలతో పానక మిస్తా గొంతు తడపతా వుండాడు.

దివిటీల వెలుగులో పీర్లు ధగధగా మెరస్తా నాలికలు కోస్తా వుండాయి.

నగిరిని దాటినాయి.

గోరీలు దాటినాయి.

సాయిబులపల్లెలో అడుగుపెట్టినాయి.

పీరునెత్తుకోనుండే గొర్రెల తాతకి ఉగ్రమొచ్చింది.

ఊగతా, తూలతా,

'హుస్సేన్ దొస్సేన్' అని అడుగులేస్తా వుండాడు.

పెదబ్బ వాళ్ళమ్మ పొయ్యి బిడ్డని తీసుకునింది.

ముగ్గురు బలమైన మనుషులు గొర్రెల తాతని పట్టుకున్నారు.

అయినా ఉరుమురిమి చూస్తా ఊగతా వుండాడు.

గడ్డం సాయిబు నెమలీకల కట్టతో దీడినాడు.

ఉగ్రం దిగిపొయింది. పానకం ఇస్తే గొంతు తడుపుకున్నాడు గొర్రెలతాత.

పీర్లు చావిట్లోకి పొయినాయి.

గోపినింటి పీరు గూడా పీర్లతోపాటు చావిట్లో కుర్చునింది.

పీరుగోడికి గుండు కొట్టించి, చదివింపు చేసి మొక్కు తీర్చుకున్నారు.

ఆ రాత్తిరి బళ్ళున తెల్లారేదాకా హుస్సేన్ దొసేన్ అంటా పైగుడ్డ ఎగరేస్తా గొర్రెల తాత గుండం తొక్కతానే వున్నేడు.

ఆపొద్దుట్నుంచి గోపినోళ్ళింట్లో పందికూర తినరు. కోడైనా, పొట్టేలైనా 'హలాల్' చెయిందే ముట్టుకోరు.

* * *

పదవరోజు పొద్దున పీర్లు స్నానానికి యలబారినాయి.

మంగళాచెరువులో పీర్లు బేటీలు తగలతాయి. చుట్టుపక్కల పల్లెల నుంచి వచ్చిన జనంతో చెరువు తొణికిలేస్తా వుండాది.

'టంగ్‌టంగ్ టంగ్ టంగ్ టంగ్ టంగ్
మని' పీర్లు బేటీలు తగిలినాయి.
పీరూపీరూ బేటి తగిలినప్పుడు నిప్పుర
వ్వలు ఎగజిమ్మినాయి.
'తళతళమని' మెరుపులు
మెరిసినాయి.
వున్నెట్టుండి మంగళాచెరువు కర్బలా
యుద్ధమైదానమైపొయింది.

మేళ్ళోళ్ళపల్లె లలితమ్మ, పెట్ల ఇబ్రామ్ తాత అంగళ్ళు పెట్టినారు. సుగీలు, వడలు, బోండాలు ఉడుకుడుగ్గా కాల్చి అమ్మతా వుండారు.

గానుగచింత నుంచి వచ్చిన దాసరోళ్ళ గంగులక్క, నగిరి నుంచి వచ్చిన దాసరోళ్ళ మారక్క ఒకరిమింద ఒకరు పోటీలుపడి గాజుల అంగళ్ళు పెట్టేసినారు. రిబ్బన్లు గాలికి రెపరెపలాడతా వుండాయి.

సారాయి అంగళ్ళు కూడా పెట్టినారు. తాగేవాళ్ళు తాగతా వుండారు. ఆడేవాళ్ళు ఆడతా వుండారు.

ఆ పక్కనుంచి గానుగచింత పీర్లు వచ్చి నిలబడినాయి.

ఈపక్కనుంచి యల్లమంద పీర్లు వచ్చి నిలబడినాయి.

ఆ ఊరి దొరవారు, ఈఊరి దొరవారు చింత చెట్టు కింద కుర్చీల్లో కూర్చున్నారు.

ఆఊరి జనం, ఈ ఊరి జనం కలిసిపొయ్యి వరసలు పెట్టి పిలుచుకుంటా గంధోడి చల్లుకుంటా వుండారు.

ఊలలేస్తా, పైగుడ్డలెగరేస్తా యుద్ధానికి కవ్విస్తా వుండారు.

ఇరువైపులా సైన్యాన్ని మోహరించినట్టు పీర్లు నిలబడి వుండాయి.

ఉగ్రమొచ్చిన పీర్లు ఊగతా వుండాయి. గుద్దులురుముతా వుండాయి. నాలికలు కోస్తా వుండాయి.

నమాజు చదివే గడ్డంసాయిబు పచ్చజెండా వూపినాడు.

అంతే,

ఆపక్కనుంచి గానుగచింతపీర్లు బాణం మాదిరి దూసుకోని వస్తా వుండాయి. ఈపక్కనుంచి యల్లమంద పీర్లు ఆకాశివ మాదిరి నిప్పులు చిమ్ముకుంటా ముందుకెగసిపోతా వుండాయి.

''హుస్సేన్ దొసేన్'' అని అరస్తా ఆపక్కనుంచి వాళ్ళూ, ఈపక్కనుంచి వీళ్ళూ పరిగెత్తుకుంటా పొయ్యి పీర్లను బేటీలు తగిలించినారు.

'టంగ్‌టంగ్ టంగ్ టంగ్ టంగ్ టంగ్‌మని' పీర్లు బేటీలు తగిలినాయి.

పీరూపీరూ బేటి తగిలినప్పుడు నిప్పురవ్వలు ఎగజిమ్మినాయి.

'తళతళమని' మెరుపులు మెరిసినాయి.

వున్నెట్టుండి మంగళాచెరువు కర్బలా యుద్ధమైదానమైపొయింది.

ఇస్లాం మతం పరిరక్షణకోసం మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ హిమాం హుస్సేన్ అలాహీ సలాం తన 72 మంది కుటుంబ సభ్యులతో, ఇరాక్‌ని పరిపాలించే యజీద్ దర్బారేషాం ఇస్లాం సైన్యంతో యుద్ధం చేస్తా వుండాడు.

కర్బలా మైదానంలో నెత్తురు ఏరులై పారతా వుండాది.

ఒక్కొక్కటిగా పీర్ల తలలు తెగిపడతా వుండాయి.

పదవ మొహర్రంన ఇమాం హుస్సేన్ తల గూడా తెగిపడింది.

యాజీద్ సైనికుల చేతిలో వీరమరణం చెందినాడు.

అంతే,

బూబవ్వ కిలారించినట్టు అరిసింది.

దిక్కులు పిక్కటిల్లినాయి.

వెంట్రుకలు ఇరబోసుకుని, లబలబా నోరు కొట్టుకుంటా కర్బలా యుద్ధమైదానంలోకి పరిగెత్తింది.

నెత్తుటిలో కాళ్ళు కూరకపోతా వుండాయి.

మొండాలు కాళ్ళకి తగులుకొని కిందపడతా వుండాది. లేస్తా వుండాది.

గెసపోస్తా పరిగెత్తతా వుండాది.

హజ్రత్ ఇమాం హుస్సేన్ మొండాన్ని వొళ్ళోకి జవురుకునింది.

''నా బిడ్డా ఇమాంహుస్సేనా! నా కొడకా వీరమరణం పొందినావా!'' అని ఏడస్తా వుండాది.

బోరోమని కురస్తా ఆకాశం గూడా బూబవ్వతో జతకలిసింది.

బూబవ్వ శోకం ఇప్పటిదిగాదు! ఆ శోకానికి అంతం గూడా లేదు.

అని కండ్ల నీళ్లుపెట్టుకోని కత చెప్పింది మిద్దింటి దీపం. ★